సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 14 । ఆగస్టు । 2025



సేంద్రియ ఎరువులపై శిక్షణ
ద్వారకా తిరుమల మండలం గుండుగొలనుకుంటలో ఐదు జిల్లాలకు చెందిన 50 మందికి సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణనిచ్చారు. 8లో ▸



నెత్తురు మరిగితే.. ఎత్తరా జెండా
గోదావరి చుట్టూ స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఉరకలెత్తించారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమ తీరంలో ఉద్యమ తీరుపై అవలోకనం 8లో ▸



నియోజకవర్గ విలీనంపై రచ్చ
ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుపై కసరత్తు చేస్తోంది. ఈ మార్పుల్లో గోపాలపురం నియోజకవర్గం పేరు తెరమీదకు రావడంతో కొత్త చర్చకు దారితీసింది. 8లో ▸

న్యూస్‌రీల్

వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలి



మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: కార్పొరేట్ల చెర నుంచి వ్యవసాయ రంగాన్ని దేశ సంపదను కాపాడుకోవాలని ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ ఆకుల హరే రామ్ పిలుపునిచ్చారు. క్విట్ కార్పొరేట్ కార్యక్రమంలో గొరగనమూడి రైస్ మిల్ నుంచి బైక్ ర్యాలీ ప్రకాశం చౌక్ చేరుకున్నాక అక్కడ సభ నిర్వహించారు. సభకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. హరేరామ్ మాట్లాడుతూ దేశ ప్రజల సంపదను నల్ల కార్పొరేట్లకు దోచిపెట్టే మోదీ విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి మరో స్వాతంత్ర పోరాటం చేయాలన్నారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు ప్రయత్నించి కార్మిక హక్కులను కార్పొరేట్లకు తాకట్టు పెడుతున్నారన్నారు. టీయూసీసీ జిల్లా నాయకులు దండు శ్రీనివాసరాజు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు ఎం.ఆంజనేయులు, బాతిరెడ్డి జార్జి, ఎస్.ఆశ్రీయ్య, బొర్రా అలమహారాజు, చల్లబోయిన వెంకటేశ్వరరావు, బి.నాగు. డి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం: విద్యాహక్కు చట్టం–2009 పరిధిలో ప్రవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యాంసుందర్ తెలిపారు. 25 శాతం శాతం కోటాలో అర్హత గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలు, అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు అర్హత ఉన్న వారికి ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 86391 33614, 95533 80179 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

కూటమి సంబరం వెలవెల



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

భీమవరం: భీమవరంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో కూటమి పార్టీల నాయకులు బుధవారం నిర్వహించిన రైతు సంబరం రైతులు లేక వెలవెలబోయింది. రైతులకు ఏటా రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చిన నాయకులు తొలి ఏడాది ఎగ్గొట్టారు. దీనికితోడు దాళ్వా ధాన్యం సొమ్ములను రైతులకు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేయడం, ప్రస్తుత సార్వా సీజన్‌లో యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్నారు. ఈ తరుణంలో కూటమి నాయకులు నిర్వహించిన కార్యక్రమానికి మొహం చాటేశారు.




భీమవరంలో హెలీప్యాడ్ వద్ద మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి తానేటి వనిత, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, పార్టీ భీమవరం, ఉండి సమన్వయకర్తలు చినమిల్లి వెంకటరాయుడు, పీవీఎల్ నరసింహరాజు

అధినేతకు నీరాజనం

జోరువానలోనూ అదే అభిమానం
- భీమవరంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం
- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పోటెత్తిన అభిమానులు
- తరలివచ్చిన ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి నాయకులు
- హెలీప్యాడ్ నుంచి కల్యాణ మండపం వరకూ భారీ జనసందోహం



అభివాదం.. భీమవరంలో అభిమానులకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఆత్మీయ పలకరింపు.. జగన్‌ను పలకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుబాబు

భీమవరం/భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా భీమవరం విచ్చేసిన మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభిమానులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కుమార్తె వివాహ వేడుకకు బుధవారం సాయంత్రం వైఎస్ జగన్ విచ్చేశారు. భీమవరంలో హెలీప్యాడ్‌కు చేరుకున్న జగన్‌ను మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల నాయకులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. అక్కడి నుంచి వైఎస్ జగన్ భీమవరంలోని వీఎస్ఎస్ గార్డెన్స్‌లో జరుగుతున్న వివాహ వేడుక వద్దకు వెళ్లారు. ఆయన కాన్వాయ్ వెంట అభిమానులు బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. జై జగన్.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా..
వైఎస్ జగన్ తాడేపల్లి నుంచి రాక ముందే భీమవరంలో వర్షం ప్రారంభమైంది. అప్పటికే జగన్‌ను చూసేందుకు భీమవరంలో హెలీప్యాడ్, కల్యాణ మండపానికి వెళ్లే దారిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా చేరుకున్నారు. భీమవరంలో జగన్ హెలీకాప్టర్ దిగే సమయంలోనూ భారీ వర్షం కురుస్తున్నా అభిమానులు అలాగే వేచి ఉన్నారు. ఆయన వెంట ఉత్సాహంగా కేరింతలు కొడుతూ కల్యాణ మండపం వరకూ తరలివెళ్లారు. వర్షంలోనూ అభిమానులకు అభివాదం చేస్తూ వైఎస్ జగన్ ముందుకుసాగారు.



తరగని అభిమానం.. జగన్ వెళుతున్న కాన్వాయ్‌ను చూసి కేరింతలు కొడుతున్న అభిమానులు



ఉరిమే ఉత్సాహమై.. తమ అభిమాన నాయకుడిని సెల్‌ఫోన్లలో బంధిస్తూ..

కల్యాణ మండపం వద్ద..
వీవీఆర్ గార్డెన్స్‌లో వేదికపైకి వచ్చిన జగన్‌ను చూసేందుకు అభిమానులు పోటీపడ్డారు. సోఫాలు, కుర్చీలు ఎక్కి మరీ ఆయన్ను చూడటంతో పాటు తమ అభిమాన నేతను సెల్‌ఫోన్లలో బంధించారు.

వైఎస్ జగన్‌ను కలిసిన ప్రముఖులు : వైఎస్ జగన్‌కు హెలీప్యాడ్ వద్ద నాయకులు ఘన స్వాగతం పలికారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల, మాజీ మంత్రులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, తానేటి వనిత, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కారుమూరి వెంకటనాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్, భీమవరం, ఉండి, చింతలపూడి, కైకలూరు, పోలవరం, ఉంగుటూరు, ఏలూరు, కొవ్వూరు, రామచంద్రాపురం, అమలాపురం ఇన్‌చార్జ్‌లు చినమిల్లి వెంకట్రాయుడు, పీవీఎల్ నర్సింహరాజు, కంభంపాటి విజయరాజు, దూలం నాగేశ్వరరావు, తెల్లం బాలరాజు, పుప్పాల వాసుబాబు, మామిళ్లపల్లి జయప్రకాష్, తలారి వెంకట్రావు, పిల్లి సూర్యప్రకాష్, పినిపే శ్రీకాంత్, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్, పార్టీ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నవుడు వెంకటరమణ, సంచార జాతుల విభాగం అధ్యక్షుడు పెండ్ర వీరన్న, పార్టీ నేతలు పేరిచర్ల విజయ నరసింహరాజు, మేడిది జాన్సన్, వేండ్ర వెంకటస్వామి, పాతపాటి శ్రీనివాసరాజు, కోడి విజయలక్ష్మి యుగంధర్, ఏఎస్ రా జు, చిగురుపాటి సందీప్, గాదిరాజు రామరాజు తదితరులు జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



కేరింతలు కొడుతూ.. జగన్ వెళుతున్న కాన్వాయ్ ముందు అభివాదం చేస్తున్న పార్టీ నాయకులు, అభిమానులు



జై జగన్.. జై జై జగన్ అంటూ..



కోలాహలం.. వైఎస్ జగన్ కాన్వాయ్ వద్ద నాయకులు, అభిమానుల కోలాహలం

దంచికొట్టిన వాన

- జలమయమైన రహదారులు
- నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు
- యంత్రాంగం అప్రమత్తం
- నేడు స్కూళ్లు, కాలేజీలకు సెలవు



ఇరగవరంలో భారీ వర్షం

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా బుధవారం భారీ వర్షం ముంచెత్తింది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, ఉండి, ఆచంట, నియోజకవర్గాల్లో కుండపోత వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లో మోస్తరు వర్షం కురిసింది. భారీ వర్షం కురిసిన ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు. కొద్దిరోజులుగా ఎండ వేడి, ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ ప్రజలు భారీ వర్షంతో వాతావరణం చల్లబడి సేద తీరినా.. లోతట్టు ప్రాంతాల్లోని నీరు నిలిచిపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజల అవస్థలు పడ్డారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి
భీమవరం(ప్రకాశం చౌక్): రానున్న 3 జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమతంగా ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. అందరూ ప్రధాన కేంద్రాల్లోనే ఉండాలని, ఎవరికీ సెలవులు మంజూరు చేయమని స్పష్టం చేశారు. నరసాపురం, మొగల్తూరు, ఆచంట మండలాల్లో ఎక్కువ దృష్టిపెట్టాలని, మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. ఎలాంటి ప్రాణ, ధన నష్టం జరగకుండా చూడాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ అత్యవసర మందులు, క్లోరిన్, బ్లీచింగ్ తదితర సామగ్రితో సిద్ధంగా ఉండాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు, ఇరిగేషన్ అధికారులు వర్షాలు తగ్గే వరకు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కలెక్టరేట్‌లో 08816 299181 నెంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.

నేడు స్కూళ్లు, కాలేజీలకు సెలవు : భారీ వర్షాల నేపథ్యంలో 14న జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, అంగన్‌వాడీలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ఆదేశాలను ప్రైవేటు విద్యాసంస్థలు తప్పకుండా పాటించాలని, లేనిపక్షంలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



తణుకు రాష్ట్రపతి రోడ్డులో రోడ్డుపై పరవళ్లు తొక్కుతున్న వర్షపు నీరు



ఆకివీడులో భారీ వర్షం కురుస్తున్న దృశ్యం



తణుకు తహసీల్దారు కార్యాలయంలో వర్షపు నీరు రావడంతో పరిశీలిస్తున్న ఆర్డీఓ

వైఎస్ ముద్రను చెరిపేసే కుట్ర

- ఉద్యాన వర్సిటీ ముఖ ద్వారం వద్ద వైఎస్ విగ్రహం ఏర్పాటుకు అడ్డుపుల్ల
- కోర్టును ఆశ్రయించిన మాజీ మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో ఏర్పాటుచేసిన డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ముఖద్వారం వద్ద యోగముద్రలో ఉన్న వైఎస్ విగ్రహం ఏర్పాటుకు సంబంధించి ఏర్పాటును అడ్డుకునేందుకు వర్సిటీ అధికారులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి 2023లో ఇక్కడ విగ్రహం ఏర్పాటుచేయాల్సి ఉంది. దీని తయారీకి అప్పటి డిప్యూటీ సీఎం శిల్పికి రూ.10 లక్షలు బయానాగా ఇచ్చారు. వర్సిటీ ముఖ ద్వారం వద్ద విగ్రహం ఏర్పాటుకు అప్పటి పాలకమండలి తీర్మానం చేసింది. ఇది కార్యరూపంలోకి తేకుండా అక్కడ ఒక రైతు, అతని భార్య బొమ్మలను ఏర్పాటుచేశారు. దీంతో వర్సిటీలో వైఎస్ ముద్రను చెరిపే కుట్ర మరోసారి తేటతెల్లమైంది. ఈ విషయంపై మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ కోర్టును ఆశ్రయించారు. విషయాన్ని పరిశీలించాల్సిన కోర్టు దీనికి సంబంధించిన వివరాలు అందచేయాల్సిందిగా ఉద్యాన వర్సిటీ అధికారులను ఆదేశించింది. రైతు ఉద్యాన పంటలతో ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాలని వైఎస్ రాజశేఖరరెడ్డి ఆకాంక్షించారు. దక్షిణ భారత దేశంలో మొదటిది.. దేశంలో రెండవదిగా ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని వెంకట్రామన్నగూడెంలో ఏర్పాటుచేశారు. తాడేపల్లిగూడెం ప్రాంతం వర్సిటీ ఏర్పాటుకు ఎందుకు అనుకూలమో కొట్టు సత్యనారాయణ అంకెలతో అసెంబ్లీలో విపులీకరించారు.



వర్సిటీ ముఖ ద్వారం వద్ద వైఎస్ విగ్రహం ఏర్పాటు చేయాల్సిన ప్రాంతంలో రైతు బొమ్మ

గూడెంలో వర్సిటీని అడ్డుకొనే ప్రయత్నం చేసిన కొంతమంది నోటికి తాళం వేశారు. గూడెంలో రాజీవ్ గృహకల్ప సముదాయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన దివంగత సీఎం రాజశేఖర రెడ్డి అదే వేదికపై నుంచి గూడెంలో ఉద్యాన వర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించారు. అనంతరం 2007లో వెంకట్రామన్నగూడెంలో ఏర్పాటుచేశారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. 2015లో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పేరును మార్చాలని జెడ్పీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. దీనిపై అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ఈ ప్రతిపాదన అటకెక్కింది.

తాజాగా రెండో కుట్ర : వైఎస్ విగ్రహాన్ని ఆయన స్మృతిచిహ్నంగా ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేయడానికి ప్లాట్‌ఫాం కట్టించారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన శిల్పికి తయారీ బాధ్యత అప్పగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ విగ్రహం ఏర్పాటుచేయాల్సిన ప్రాంతంలో రైతు దంపతుల బొమ్మను ఏర్పాటుచేసింది. దీంతో కొట్టు సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు.

మాట తప్పారు
వైఎస్ కృషితో ఇక్కడ ఉద్యాన వర్సిటీ వచ్చింది. ఆయన సేవలకు గుర్తింపుగా వర్సిటీ ముఖ ద్వారం వద్ద యోగ ముద్రలో వైఎస్ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని 2023లో నిర్ణయం తీసుకున్నాం. ఈ మేరకు విగ్రహం తయారీకి బయానా ఇచ్చాం. నిర్ణయించిన ప్రాంతంలో విగ్రహం ఏర్పాటుకు అప్పటి పాలకమండలి తీర్మానం చేసింది. అది కాదని రైతు దంపతుల బొమ్మను పెట్టారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించా. విచారణ ఈ నెల 19కి వాయిదా పడింది.
– కొట్టు సత్యనారాయణ, మాజీ డిప్యూటీ సీఎం

కోర్టు ఆదేశాలు అందలేదు
వైఎస్ విగ్రహం ఏర్పాటులో హైకోర్టు ఆదేశాలు ఇంకా మాకు అందలేదు. అందిన తర్వాత గత విషయాలు పరిశీలించి ఉన్నతాధికారి నిర్ణయం తీసుకుంటారు.
– బి.శ్రీనివాసులు, రిజిస్ట్రార్, ఉద్యాన వర్సిటీ

క్లుప్తంగా

ఎక్సైజ్ స్టేషన్‌పై దాడి



గ్రామస్తుల దాడిలో ఎక్సైజ్ కార్యాలయంలో ధ్వంసమైన కుర్చీలు

చింతలపూడి: చింతలపూడి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌పై నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పలువురు బుధవారం దాడి చేశారు. గ్రామంలో సారా తయారు చేస్తున్న వడిత్యా రామదాసు అనే వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనిపై పీడీ యాక్టు నమోదు చేస్తున్నారన్న అనుమానంతో బంధువులు, కుటుంబ సభ్యులు దాడి చేసినట్లు ఎక్సైజ్ సిబ్బంది చెప్పారు. దాడిలో కార్యాలయంలోని కుర్చీలు, ఫర్నిచర్ ధ్వంసమయ్యాయన్నారు. ఆ సమయంలో అధికారులు ఎవరూ కార్యాలయంలో లేరు. జరిగిన ఘటనపై అధికారులకు, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సిబ్బంది చెప్పారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కాళ్ల: కూలి పనికి వెళ్లి విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై ఎస్. శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం కాళ్ళకూరు గ్రామానికి చెందిన ఉబ్బా వెంకన్న(36) బుధవారం కూలి పని నిమిత్తం దొడ్డనపూడి గ్రామం వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా వర్షపు చినుకుల వల్ల కరెంటు షాక్ కొట్టడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు అతడ్ని వైద్యం నిమిత్తం కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. మృతుని అన్నయ్య రాంబాబు ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అథ్లెటిక్స్‌లో పతకాలు



పతకాలు సాధించిన అథ్లెట్లను అభినందిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: ఈ నెల 9 నుంచి 11 వరకూ చీరాలలో జరిగిన 36వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన ఏలూరు జిల్లా బాలికలకు డీఎస్‌డీఓ బి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. డీఎస్‌ఏ కోచ్ గంటా కృష్ణకుమారి వద్ద శిక్షణ పొందుతున్న వి రంజని 400 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్, 200 మీటర్ల పరుగులో బ్రాంజ్ మెడల్ సాధించిందని వివరించారు. మిడిల్ రిలే విభాగంలో జె పల్లవితో పాటు రంజని సైతం బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు. అండర్–20 విభాగంలో బి నీలిమ 400 మీటర్ల పరుగులో బ్రాంజ్ మెడల్, ఎం దొరబాబు పెంటథలోన్‌లో బ్రాంజ్ మెడల్ చేజిక్కించుకున్నారని వివరించారు.

నెత్తురు మరిగితే.. ఎత్తరా జెండా..

- బ్రిటీష్ పాలకులపై గర్జించిన అలనాటి యోధులు
- ఉమ్మడి పశ్చిమలో ఉవ్వెత్తున ఎగసిన స్వాతంత్ర్య కసి
- కైకలూరులో కదం తొక్కిన ఉద్యమ వీరులు
- పంద్రాగస్టు వేడుకలకు సిద్ధమవుతున్న పల్లెలు



కైకలూరులో బ్రిటీష్ కాలంలో నిర్మించిన కోర్టు భవనం



యూపీ స్కూల్‌లో సమరయోధుల స్మారక స్థూపం

కైకలూరు: బ్రిటీష్ సామ్రాజ్యాన్ని అహింస అనే ఆయుధంతో గడగడలాడించిన మహాత్ముని మనోనిబ్బరాన్ని కసిగా చూసిన కళ్లు అవి.. తెల్లదొరల లాఠీ దెబ్బలకు తట్టుకున్న శరీరాలు అవి.. స్వాతంత్ర్య సమరోద్యమంలో జైలు గోడలను తడిమిన చేతులు అవి.. ఆంగ్లేయుల ఫిరంగిలకు దమ్ముగా రొమ్ము చూపు పోరాట పటిమను చూపిన తెగువ వీరి సొంతం.. అప్పటి స్వాతంత్ర్య సమరయోధులు జీవించిలేకున్నా.. వారి ఆశయాలు సజీవం. గోదావరి నదీ పాయల చుట్టూ ఉద్యమాన్ని ఉరకలేయించారు.. కృష్ణమ్మ చెంత పౌరుషంతో నురగలు కక్కించారు.. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమతీరంలో ఉద్యమ తీరుపై అలనాటి అలవోకనం

ఏలూరు.. సమరహోరు...

బ్రిటిష్ పాలనలో ఏలూరు ఒక మిలటరీ స్టేషన్‌గా ఉండేది. రాజమండ్రి గోదావరి జిల్లాల ప్రధాన కేంద్రంగా ఏలూరు పేరు గడించింది. ఈ పట్టణానికి 1937లో మహాత్మా గాంధీ, 1940లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విచ్చేసి స్వాతంత్ర్య సమరోత్సవాన్ని ప్రజల్లో రేకెత్తించారు. ఉమ్మడి జిల్లాలో గార



స్వాతంత్ర్య సమరయోధుడు చిర్రవూరి అచ్యుతరామయ్య, వెంకటలక్ష్మమ్మ దంపతులు (ఫైల్)

పాటి సత్యనారాయణ, చింతలపాటి మూర్తిరాజు, మంగళంపల్లి చంద్రశేఖర్, ఉప్పాల కోదండరామయ్య వంటి ఎందరో స్వాతంత్ర్య పోరాటంలో ప్రతిభ చూపారు. భీమవరం, నరసాపురం, పాలకొల్లు, నూజివీడు, ఆచంట ప్రాంతాలు స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించాయి.

కదం తొక్కిన కైకలూరు

స్వాతంత్ర్య పోరాటంలో కైకలూరు ప్రాంతం కదం తొక్కింది. విదేశీ వస్త్రాలను బహిష్కరించాలని మహాత్మా గాంధీ నుంచి ఆదేశాలు రావడంతో కైకలూరు తాలూకా నడిరోడ్డుపై విదేశీ వస్త్రాలను ధైర్యంగా తగలబెట్టారు. దీంతో బ్రిటీష్ పాలకులు లాఠీలకు పని చెప్పారు. తుపాకులను ఎక్కుపెట్టారు. అయినా దమ్ముగా రొమ్ము చూపి వారిని ఎదిరించారు. ఎంతోమందిని జైల్లో నెట్టేశారు.

స్వాతంత్ర్యం సిద్ధించి 25 సంవత్సరాలు గడిచిన సందర్భంగా అప్పట్లో కైకలూరు పాఠశాల వద్ద సమరవీరులు సేవలకు గుర్తుగా స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేశారు. కైకలూరు పంచాయతీ తాలూకా పరిధికి చెందిన ఘంట పేరయ్య, కంతేటి కాశీవిశ్వనాథం, మాగంటి నాయుడమ్మ, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, మాగంటి సత్యనారాయణ, రుద్రరాజు సూర్యనారాయణరాజు, చిర్రవూరి అచ్యుత రామయ్య, పొన్నాడ శ్రీరామచంద్రుడు, మేక తిరుపతయ్య, గుంటూరు రామదాసు, ఉన్నూరి నరసింహరాజు స్వాతంత్ర్య సమరయోధుల పేర్లను లిఖించారు.

బ్రిటీష్ పాలకుల అడ్డా..

పూర్వం కైకలూరుని కైంకర్యపురి అని పిలిచేవారు. కొల్లేరు సరస్సు కారణంగా ప్రముఖంగా పేరు గడించింది. కైకలూరు తాలూకాగా ఉండేది. ఇక్కడి నుంచి బ్రిటీష్ పాలకులు కార్యక్రమాలను కొనసాగించేవారు. కైకలూరు మండలం వింజరం లాకుల వద్ద బ్రిటీష్ పాలనలో పడవలపై కూరగాయల సంత జరిగేది. ఆ గ్రామ సమీపంలో బ్రిటీష్ పాలకులు సేద తీరడానికి కట్టడాలు నిర్మించుకున్నారు. ఇక ప్రధాన పరిపాలన కైకలూరు నుంచి సాగేది. అందుకే కోర్టు, రెవెన్యూ కార్యాలయం, పోలీస్ స్టేషన్, సబ్ ట్రెజరీ, ఆస్పత్రి, సబ్‌జైలు బ్రిటీష్ పాలకులు ఒకే వరుసలో నిర్మించారు. అప్పట్లో స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ఆందోళన చేసిన వారిని అరెస్టు చేసి కైకలూరు జైలుకు తరలించేవారు. శుక్రవారం ప్రంద్రాగస్టు సందర్భంగా అలనాటి స్వాతంత్ర్య సమరయోధుల వారసుల మనోభావాలు వారి మాటల్లోనే..

పొట్టి శ్రీరాములుతో కలిసి జైలు జీవితం



మా నాన్న పేరు కంతేటి కాశీ విశ్వనాథం. 4గురు మగ, 4గురు ఆడ సంతానం. మా నాన్న గుడ్లవల్లేరులో ఉండగా ఉద్యమంలో పాల్గొన్నందుకు బాపట్ల జైలులో పెట్టారు. అక్కడ పొట్టి శ్రీరాములు, నాన్న పక్కపక్కనే జైలు జీవితం అనుభవించారు. నాన్నకు ప్రభుత్వం తామ్రపత్రం అందించింది. కలిదిండి మండలంలో 5 ఎకరాలు పొలం ఇచ్చారు. కైకలూరులో కాశీరాజు కిరాణాకొట్టుగా నడిపారు.

– కంతేటి శ్యామ్ సుందర జగన్నాథరావు, భీమవరం

ఆదర్శవాది అచ్యుతరామయ్య



మా నాన్న పేరు చిర్రవూరి అచ్యుతరామయ్య. ముగ్గురు ఆడ, ఒక మగ సంతానం. స్వాతంత్ర్య ఉద్యోమంలో అనేక పోరాటాలు చేశారు. మెడికల్ రిప్రజంటేటీవ్‌గా అప్పట్లో పని చేశారు. ఆయన మాకు ఎన్నో స్వాతంత్ర్య ఘట్టాలను వివరించేవారు. కైకలూరు ప్రాంతంలో అనేక ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచారు. ఆయన 1966లో మరణించారు. ఆయన కుమారుడిగా పుట్టడం గర్వంగా ఉంది.

– చిర్రవూరి శివరామశాస్త్రి, హైదరాబాద్

ఆచార్య ఎన్జీ రంగా శిష్యుడు



మా నాన్న పేరు ఉప్పాల కోదండరామయ్య. ఆచార్య ఎన్జీ రంగా ప్రియశిష్యులు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. ఆయనకు ఏడుగురు మగపిల్లలు, ముగ్గురు ఆడ పిల్లలు సంతానం. రాజమండ్రి సెంట్రల్ జైలుకు తీసుకెళ్లి అక్కడ జైళ్లు నిండటంతో తెనాలిలో బంధించారు. ఆయన 101 సంత్సరాలు జీవించారు. ఆయన చూపిన మార్గం మాకు ఎంతో ఆదర్శం.

– ఉప్పాల రవీంద్రబాబు, కైకలూరు

విద్యుత్ విజిలెన్స్ దాడులు



కైకలూరులో విద్యుత్ మీటరును తనిఖీ చేస్తున్న అధికారి

కైకలూరు: విద్యుత్ మీటర్ల వినియోగంపై విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు కైకలూరు మండలంలో బుధవారం చేశారు. విజిలెన్స్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు చాగంటి వాసు నేతృత్వంలో 43 బృందాలు దాడుల్లో పాల్గొన్నాయి. మండలంలో కైకలూరు, ఆటపాక, గోపవరం, రాచపట్నం, తామరకొల్లు, వింజరం, వేమవరప్పాడు గ్రామాల్లో మొత్తం 3,009 వివిధ కేటగిరీల సర్వీసులను విజిలెన్స్ బృందాలు తనిఖీలు చేశాయి. వీటిలో మొత్తం 525 సర్వీసుల నిబంధనలు అతిక్రమించినట్లు నిర్ధారించి వారి వద్ద నుంచి రూ.11,40,600 జరిమానాలు వసూలు చేశారు. కార్యక్రమాల్లో గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాసరావు, కైకలూరు డీఈఈ బి.రామయ్య, కైకలూరు టౌన్ సెక్షన్ ఏఈ కె.శ్రీనివాసమూర్తి, గుడివాడ డివిజన్ ఏఈలు, డీఈఈలు, ఏ ఈఈలు, జేఈలు,లైన్ ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడి మృతి



ఉల్లంపర్తి కృష్ణమూర్తి (ఫైల్)

నరసాపురం: దీర్ఘకాలంగా మున్సిపాలిటీలో పర్మినెంట్ పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న ఉల్లంపర్తి కృష్ణమూర్తి (59) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. పట్టణంలోని అరుంధతి పేటకు చెందిన ఉల్లంపర్తి కృష్ణమూర్తి ప్రతి రోజూ మాదిరిగానే బుధవారం ఉదయం 4 గంటలకు వచ్చి 6వ వార్డులో విధులు నిర్వహిస్తున్నాడు. 11 గంటల ప్రాంతంలో కోవెలగుడి వీధిలో పనిచేస్తూ గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. సహచర కార్మికులు వెంటనే అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కృష్ణమూర్తికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కృష్ణమూర్తి విధుల్లో అంకితభావంతో పనిచేస్తూ వార్డు ప్రజలతో తలలో నాలుకలా ఉంటాడని, అతడి మరణం బాధాకరమని పలువురు పేర్కొన్నారు. కృష్ణమూర్తి మృతిపట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కమిషనర్ అంజయ్య సంతాపం తెలిపారు.

నియోజకవర్గ విలీనంపై రచ్చ

- తెరమీదకొచ్చిన గోపాలపురం నియోజకవర్గం
- గోపాలపురం, దేవరపల్లి మండలాలను ఏలూరు జిల్లాలో కలపొద్దని డిమాండ్
- నల్లజర్ల మండలం ఎటున్నా ఓకే..



ద్వారకాతిరుమల: ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుపై కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా జిల్లాల సరిహద్దులు, పేర్లు, మండలాల మార్పులపై ఏడుగురు మంత్రులతో కూడిన సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. నెల రోజుల్లోగా దీనిపై నివేదిక ఇవ్వాలని ఈ కమిటీని ఆదేశించింది. అయితే ఈ మార్పుల్లో గోపాలపురం నియోజకవర్గం పేరు తెరమీదకొచ్చింది. గతంలో రాష్ట్రంలో 13 జిల్లాలు ఉండగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విభజన ద్వారా ఆ జిల్లాల సంఖ్యను 26కు పెంచింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ జిల్లాల సంఖ్యను 32కు పెంచడంతో పాటు, ప్రస్తుతం ఉన్న జిల్లాల సరిహద్దులు, పేర్లు, మండలాల మార్పునకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న గోపాలపురం నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లాలోకి మార్చేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు సమాచారం. పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా జిల్లా కేంద్రాల దూరాన్ని తగ్గించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ మార్పులు చేస్తోంది.

గతంలో ప్రజల అభిప్రాయం మేరకే..

గోపాలపురం నియోజకవర్గంలో ద్వారకాతిరుమల, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో జిల్లాల విభజన జరిగిన సమయంలో గోపాలపురం నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని నిర్ణయించినప్పుడు, ద్వారకాతిరుమల మండల ప్రజలు తమ మండలాన్ని ఏలూరు జిల్లాలో కలపాలని రాజకీయ పార్టీలకు అతీతంగా ఆందోళనలు చేశారు. అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు చినవెంకన్న కొలువైన ద్వారకాతిరుమల మండలాన్ని ఏలూరు జిల్లాలో చేర్చాలని పట్టుబట్టారు. ప్రజాభీష్టం మేరకు అప్పటి ప్రభుత్వం ద్వారకాతిరుమల మండలాన్ని ఏలూరు జిల్లాలో, మిగిలిన మూడు మండలాలు(గోపాలపురం నియోజకవర్గాన్ని) తూర్పుగోదావరి జిల్లాలోకి మార్చారు.

ఆ రెండు మండలాల వారికి ఇబ్బందే

గోపాలపురం, దేవరపల్లి మండలాల వారికి తూర్పుగోదావరి జిల్లా కేంద్రం ప్రస్తుతం దగ్గరగా ఉంది. దేవరపల్లి నుంచి రాజమండ్రికి 33 కిలోమీటర్లు, గోపాలపురం నుంచి 39 కిలోమీటర్లు, నల్లజర్ల నుంచి 52 కిలోమీటర్లు దూరం. అదే ఈ మూడు మండలాలను ఏలూరు జిల్లాలోకి మారిస్తే దూరం పెరుగుతుంది. దేవరపల్లి నుంచి ఏలూరుకు 66 కిలోమీటర్లు, గోపాలపురం నుంచి 75 కిలోమీటర్లు, నల్లజర్ల నుంచి 45 కిలోమీటర్లు దూరం ఉంది. మండల శివారు గ్రామాల వారికి దూరం మరింత పెరుగుతుంది.

సోషల్ మీడియాలో మొదలైన రచ్చ

దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాలను ఏలూరు జిల్లాలో మార్చేప్రయత్నం జరుగుతున్న నేపథ్యంలో ఆ మండలాల ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కొందరు సోషల్ మీడియా ద్వారా తమ అభిప్రాయాలను బహిర్గతం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా జిల్లాలు మార్చడం సరికాదని, గోపాలపురం నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలోనే ఉంచాలని పోస్టులు పెడుతున్నారు. దీనిపై ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఆలోచన చేయాలని కోరుతున్నారు. మరి కొందరు పార్టీలకు అతీతంగా ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలపాలని పోస్టులు పెడుతున్నారు.

పరిగణనలోకి తీసుకుంటారా..

జిల్లాల సరిహద్దులు, పేర్లు, మండలాల మార్పులు చేసేటప్పుడు ప్రజాభిప్రాయాలను కూటమి ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందా.? లేక సబ్ కమిటీ సూచనలనే అమలు చేస్తుందా.. అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏది ఏమైనా గోపాలపురం నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లాలో కలిపే అంశంపై కూటమి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

బాలయోగి వంతెనకు పరదాలు



బాలయోగి వంతెనపై ఇరువైపులా ఏర్పాటు చేసిన పరదాలు



తమ్మిలేరులో వేసిన చెత్త, వ్యర్థాలు

ఏలూరులోని తమ్మిలేరుపై నిర్మించిన బాలయోగి వంతెనపై కార్పొరేషన్ అధికారులు వంతెనకు ఇరువైపులా పరదాలు కట్టారు. బాలయోగి వంతెన తమ్మిలేరులో వ్యర్థాలు వేస్తున్నారని 'సాక్షి' మీడియాలో వస్తున్న వరుస కథనాలకు అధికారులు స్పందించి వ్యర్థాలు వేయకుండా ఇరువైపులా ఇదిగో ఇలా పరదాలు ఏర్పాటు చేశారు. అయినా చుట్టుపక్కల వారు చెత్త, వ్యర్థాలు వేయడం మాత్రం మానలేదు. స్థానికులకు అవగాహన కల్పించి తమ్మిలేరులో చెత్త, వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



దర్శనమంటూ 'శఠగోపం'

- అంతర్రాష్ట్ర మోసగాడి అరెస్టు
- తెలుగు రాష్ట్రాల్లో పలు కేసులు



నిందితుడితో సీఐ శ్రీనివాస్

జగ్గంపేట: తిరుమల తిరుపతి దేవస్థానంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు ఇప్పిస్తానని నమ్మించి, మోసం చేసేందుకు యత్నించిన మోసగాడిని జగ్గంపేట పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ బుధవారం తన కార్యాలయంలో వెల్లడించారు. కోనసీమ జిల్లా గుడిమెల్లంక గ్రామానికి చెందిన జి.రాజ్‌కుమార్ అలియాస్ విజయ్‌కుమార్ అలియాస్ వంశీపై పలు చీటింగ్ కేసులున్నాయి. 2020–24 వరకూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని అనేక చోట్ల పలు కేసులు నమోదయ్యాయి. ఇతడిపై సూర్యాపేట, తణుకు, కృష్ణలంక, పాలకొల్లు, నర్సాపురం, ఎల్‌బీ నగర్ (హైదరాబాద్) పోలీస్ స్టేషన్లలో చీటింగ్ కేసులు ఉన్నాయి. గతంలో పాలకొల్లు, తణుకుల్లో నమోదైన కేసుల్లో ఇతడు అరెస్ట్ అయ్యాడు. సోషల్ మీడియా ద్వారా వ్యాపారాలు చేసే వారిని, ధనవంతులను లక్ష్యంగా చేసుకుని, వారికి తాను ప్రముఖ ప్రజాప్రతినిధుల పీఏగా పరిచయం చేసుకుంటూ సైబర్ మోసాలకు పాల్పడుతున్నాడు. ఇతడు గోవా నుంచి తన కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. ఇదే క్రమంలో టీటీడీ బోర్డు మెంబర్ పీఏగా గోకవరం మండలంలోని గోల్డ్ షాపు యజమాని పట్నాల నాగేంద్రకు ఫోన్ ద్వారా పరిచయం చేసుకున్నాడు. తిరుమల తిరుపతి దేవస్థానంలో వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్లు ఇప్పిస్తానని చెప్పి, రూ.50 వేలు ఖర్చవుతాయన్నాడు. అనుమానం వచ్చిన నాగేంద్ర అప్రమత్తం కావడంతో.. రాజ్‌కుమార్ మోసం బయటపడింది. దీనిపై టీటీడీ మెంబర్ జ్యోతుల నెహ్రూ పీఏ ప్రసాద్ జగ్గంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై నిఘా పెట్టిన పోలీసులు బుధవారం జగ్గంపేట వచ్చిన సందర్భంలో అరెస్టు చేశారు. ఇతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ



సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ పొందుతున్న బయో రిసోర్స్ సెంటర్ యజమానులు

ద్వారకాతిరుమల: రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత సంవత్సరంలో 3.5 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయంలోకి తీసుకురావడమే లక్ష్యంగా రైతు సాధికార సంస్థ పనిచేస్తోందని ఆ సంస్థ ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్ట్ అధికారి రాథోడ్ ప్రవీణ్ తెలిపారు. మండలంలోని గుండుగొలనుకుంట గ్రామంలోని బయో రిసోర్స్ సెంటర్ యూనిట్‌లో ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన 50 మంది బయో రిసోర్స్ సెంటర్ యజమానులకు బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాథోడ్ ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయంలో సాగు విస్తీర్ణాన్ని పెంచే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో మరిన్ని బయో రిసోర్స్ సెంటర్లను ఏర్పాటుచేసి, రాష్ట్రస్థాయి నిపుణులతో రిసోర్స్ ట్రైనర్లకు శిక్షణ అందించి, వారి ద్వారా బయో రిసోర్స్ సెంటర్ యజమానులకు ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల వినియోగంలో శిక్షణ అందిస్తామన్నారు. ఏలూరు ప్రకృతి వ్యవసాయం డీపీఎం వెంకటేష్, బయో రిసోర్స్ సెంటర్ యజమానులు గోపాల్ కృష్ణ, వెంకటరత్నాజీ, డీపీఎంయూ నుంచి జతిన్ (కమ్యూనికేషన్ ఇంటర్న్), ఎస్‌పీఎంయూ బృంద సభ్యులు పాల్గొన్నారు. వారు జీవ ఉత్పత్తుల నాణ్యత, బీఆర్‌సీ యూనిట్ల నిర్వహణ, ప్రకృతి వ్యవసాయం వల్ల నేల, మానవ ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలపై మార్గనిర్దేశం చేశారు.

అనవసర పెట్టుబడితో నష్టపోవద్దు



ఈపంట నమోదు పరిశీలిస్తున్న జేసీ

గణపవరం: రైతులు అవసరం లేకుండా ఎరువులు, పురుగుమందులు వాడటం ద్వారా అనవసర పెట్టుబడితో నష్టపోతున్నారని, వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన గణపవరం మండలం కేశవరంలో వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న ఈపంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా రైతులను కలిసి ఏ రకాల పంటలు వేసి, పెట్టుబడి, ఎరువుల లభ్యత వంటి అంశాలపై రైతుల నుంచి ఆరా తీశారు. వ్యవసాయ సిబ్బంది తాము ఎదుర్కొంటున్న సమస్యలను జేసీకి వివరించారు. సర్వే నంబరులో ఉన్న పొలానికి 20 మీటర్ల దగ్గరకు వెళ్తే కాని ఈపంట నమోదు కావడం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఏవో ఆర్ఎస్ ప్రసాద్, రైతులు యాళ్ల పెద్దిరాజు, దండు గజపతిరాజు, దండు రామచంద్రరాజు పాల్గొన్నారు.


గంజాయి కేసులో ఇద్దరి అరెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

మండవల్లి: గంజాయి కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ వి.రవికుమార్ చెప్పారు. మండవల్లి పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలను వెల్లడించారు. కైకలూరు వెలమపేటకు చెందిన షేక్ ఫరీద్ అబ్బాస్, ముదినేపల్లి మండలం చైతన్యపురంనకు చెందిన ఎలికే రాజేష్ కొంతకాలంగా గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి క్రయ, విక్రయాలకు పాల్పడుతున్నారు. బుధవారం చావలిపాడు వద్ద వీరిని పోలీసులు అరెస్ట్ చేసి నిందితుల నుంచి 755 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం ననుసరించి కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు. సమావేశంలో రూరల్ ఎస్సై సీహెచ్‌ఎస్ రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణకు సేవా పతకం



సత్యనారాయణ

దెందులూరు: దెందులూరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎస్‌వీఆర్ సత్యనారాయణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలీస్ సేవా పతకం ప్రకటించింది. సత్యనారాయణ పోలీస్ శాఖలో 1993లో కానిస్టేబుల్‌గా చేరారు. ఆయనకు పోలీస్ సేవా పథకం రావడంపై ఎస్సై ఆర్.శివాజీ, హెడ్ కానిస్టేబుల్, ఇతర కానిస్టేబుళ్లు హర్షం వ్యక్తం చేశారు

క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ చేయొద్దు



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణ చేయొద్దని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మంగరాజు ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ఏఓకు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వినతిప్రతం అందజేశారు. మంగరాజు మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాష్ట్రంలోని 59 షెడ్యూల్డ్ కులాలను జనాభా ఆధారంగా మూడు గ్రూపులుగా విభజించి రిజర్వేషన్లు కేటాయించడం సరికాదని, ఆర్టికల్ 341 ప్రకారం షెడ్యూల్డ్ కులాలు జాబితాలో మార్పులు చేసే అధికారం కేంద్రానికే ఉందని, రాష్ట్రానికి లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న మాలలకు 28 సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో బుధవారం మధ్యాహ్నం హర్‌ఘర్ తిరంగా యాత్ర బీజేపీ పట్టణ కమిటీ, శ్రీవాసవీ జీఎంఆర్ జూనియర్, డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, జిల్లా నాయకులు ఈతకోట తాతాజీ, కోట రాంబాబు, దువ్వా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

అత్తిలి: నాన్ లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు కలిగిన యజమానులు ప్రభుత్వం లేఅవుట్ రెగ్యులజేషన్ స్కీమ్‌ను ప్రవేశపెట్టినందున తమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని అత్తిలి గ్రామ పంచాయ తీ కార్యదర్శి జి భాస్కర్ కోరారు. అత్తిలి గ్రామ పంచాయతీ పరిధిలోని వారు తమ స్థలాలను ఈ స్కీంలో దరఖాస్తు చేసుకొని రెగ్యులర్ అనుమతులు తీసుకోవాలని కోరారు. అనుమతులు పొందినవారికే మౌలిక వసతులు కల్పిస్తారని ఈ అవకాశం అక్టోబర్ 25 లోపు దరఖాస్తు చేసుకున్న వారికే వర్తిస్తుందని తెలిపారు. వివరాలకు గ్రామ పంచాయతీలో కానీ, హెల్ప్‌లైన్ నంబర్ 99668 48055కు గాని సంప్రదించాలని సెక్రటరీ కోరారు.

యూనియన్ బ్యాంక్ నూతన శాఖ ఏర్పాటు



ఇరగవరంలో యూబీఐ అధికారులకు జ్ఞాపికను అందజేస్తున్న సిబ్బంది

ఇరగవరం: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన విస్తరణలో భాగంగా బుధవారం పశ్చిమ గోదావరి జిల్లాలోని ఇరగవరంలో కొత్త శాఖను ప్రారంభించింది. ఈ శాఖను కె.పాలేశ్వరరావు గ్రూప్ డైరెక్టర్ ఏఎఫ్ఏపీసీ ఆర్‌డీఏ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.పాలేశ్వరరావు మాట్లాడుతూ ఈ శాఖ ఈ ప్రాంత ప్రజలకు ఆధునిక బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తెస్తుందన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్లప్పుడూ గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక సేవలను విస్తరించడానికి కట్టుబడి ఉందన్నారు. భీమవరం రీజనల్ హెడ్ ఉదయగిరి మణ్యం మాట్లాడుతూ ఈ శాఖలో ఆధునిక బ్యాంకింగ్ సౌకర్యాలతో పాటు, సేవింగ్స్ అకౌంట్, కరెంట్ అకౌంట్, డిజిటల్ బ్యాంకింగ్, అన్నిరకాల రుణ సౌకర్యాలు అందుబా టులో ఉంటాయనితెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు ఉన్నతాధికారులు, బ్రాంచ్ మేనేజర్ హరి నాగేంద్ర ,స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి త్రిసభ్య కమిటీలు కృషి చేయాలి

అత్తిలి: రైతుల ప్రయోజనాలు కాపాడే విధంగా సొసైటీ అభివృద్ధికి త్రిసభ్య కమిటీలు కృషి చేయాలని దేవస్థానం మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ గారపాటి ధర్మయ్య అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడు వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా విత్తంశెట్టి సత్తిబాబు, డైరెక్టర్లుగా ప్రగడ శ్రీనివాస్, అరిగెల నరేష్‌ల ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం నిర్వహించారు.

రైతులిచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: రైతులిచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని పెదతాడేపల్లి, ఆరుగొలను సొసైటీ త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, సర్పంచ్ పోతుల అన్నవరం, మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్ పాల్గొన్నారు.

అపారిశుద్ధ్యం.. రోగాలకు నిలయం

- దుర్గంధంలో గ్రామాలు
- పట్టించుకోని పాలకులు



రోడ్డుపై మేస్తున్న పందులు



కాలువ గట్టుపై వేస్తున్న చెత్త, కొబ్బరి బొండాలు

పెంటపాడు: అలంపురంలో అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. ఈ అపారిశుద్ధ్యం రోగాలకు నిలయంగా మారిందని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఎన్ని సార్లు హెచ్చరించినా పందుల నిర్మూలకు పాలకులు పూనుకోవడంలేదు. ప్రధానంగా శివాలయం, సాయిబాబా ఆలయం, ప్రభుత్వ పాఠశాలఉన్న ప్రాంతాల్లో పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. సమీపంలోని మిడ్‌లెవెల్ కాలువ గట్టున చెత్తను వేస్తున్నారు. రోజులు గడుస్తున్నా చెత్తను తొలగించడంలేదు. ప్రధానంగా ఆ ప్రాంతం పందులకు ఆవాసంగా మారింది. సుమారు రెండేళ్ల నుంచి ఈ సమస్య వెంటాడుతోంది. కానీ దీనిపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. నిత్యం గ్రామ కార్యదర్శితోపాటు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది ఆ దారిగుండానే వెళ్లాలి. అయినా ఎవరికి వారు తమకెందుకులే అని పట్టించుకోవడంలేదు. అయితే అక్కడే రోడ్డు పక్కనే టైర్లు వేసి పందులకు మేత తినిపిస్తున్నారు. ఆ ప్రాంతం నిత్యం దుర్గంధం వెదజల్లుతోంది. మిడ్‌లెవెల్ కాలువ కూడా కలుషితం అవుతోంది.

కింది గ్రామాలకు ఈ కాలువే ఆధారం

కింది గ్రామాల ప్రజలకు, పంచాయతీ చెరువులకు అదే నీటిని అందించాల్సిఉంది. ఈ పందుల ఆవాసాలకు సమీపంలోనే స్వచ్ఛభారత్‌లో బ్రాత్రూమ్ లు నిర్మించారు. రోడ్డుకు అటువైపుగా మాంసం, చేపల దుకాణాలుఉన్నాయి. అలంపురం- ప్రత్తిపాడు వెళ్లేందుకు వీలుగాఉన్న వంతెనపై నిత్యం చేపలు అమ్మి, అక్కడే మిడ్‌లెవెల్ కాలువలో సంచులతో వ్యర్థాలను పడేస్తున్నారు. వాటి వ్యర్థాలు మిడ్‌లెవెల్ కాలువలో పడేస్తున్నారు. కాగా కింది గ్రామాల ప్రజలకు అదే నీరు దిక్కవుతోంది. కొబ్బరి బొండాలు, పెంటతో కలిసిన మూటలు అక్కడే ఉన్నాయి. దుర్వాసన వస్తున్నా పంచాయతీ సిబ్బంది కనీ సం బ్లీచింగ్ కూడా చల్లించడం లేదు. పారిశుద్ధ్యం మెరుగునకు తక్షణ చర్యలు తీసుకొవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా ఈ మిడ్‌లెవెల్ కాలువ ప్రాంతం ప్రత్తిపాడు, అలంపురం గ్రామాలకు సంబంధించినది. అయితే రెండు గ్రామాల ప్రజలకు కూడా ఈ చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడం లేదు. తక్షణం ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా నివా రణ చర్యలు చేపట్టి, ప్రజల ఆరోగ్యాలను కాపాడా లని ప్రజలు పాలకులను, అధికారులను వేడుకుంటున్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తాడేపల్లిగూడెం రూరల్: భారీ వర్షాలు, తుఫాను నేపథ్యంలో ఈ నెల 17వ తేది వరకు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ కొనసాగుతుందని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 6 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు మూడు షిఫ్టులుగా వీఆర్వోలు పని చేస్తారన్నారు. వారి వివరాలు ఇలా.. 14న వై.పద్మావతి 8008187424, వి.రమాదేవి 8978055125, కె.కాంతం 9989909648, కేవీ శ్రీనివాసరావు 9160177056, టీవీఎస్ఎస్ఎస్ శ్రీనివాస్ 9493213019, 15న బి.దుర్గాభాయి 97016 70457, వి.భవ్యమాధురి 9849167752, వైవీ.మంగరాజు 9440321055, జీవీ.నర్సయ్య 9908853772, వీ.సుబ్బారావు 9912699674, ఎం.శ్రీనివాసరావు 9395135677, విజయలక్ష్మి 7780613163, జి.వంశీ 8374664591, 16న శ్రీదేవి 9618737553, ఎస్.అనసూయ 9704 186273, ఎన్.రామకృష్ణ 9441655192, కె.సత్యనారాయణ 8184888902, 17న ఇ.ధనలక్ష్మి 9949543904, ఎన్.సంధ్య 94936 84847, వి.సురేష్‌కుమార్ 9701654484, ఎం.దుర్గాప్రసాద్ 7893531917, పి.మణికుమార్ 8374 776622, జి.చంద్రరావు 9581419581 నంబర్లను సంప్రదించాలన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించండి



పట్టణంలో పథకాల లబ్ధిదారుల వివరాలు పరిశీలిస్తున్న జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి

తాడేపల్లిగూడెం: ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు సమస్యలు ఉంటే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి , వాటిని సత్వరమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల జాబితాను పరిశీలించారు. పెండింగ్‌కు గల కారణాలను అడిగారు. గూడెం పట్టణం, గ్రామీణ మండలాలకు సంబంధించి సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ సర్టిఫికెట్ల గురించి మాట్లాడారు. పట్టణంలోని నాలుగు, 30వ వార్డులో పర్యటించారు. కుల ధృవీకరణ పత్రాలు, ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులతో జేసీ మాట్లాడారు. మండలంలో రీసర్వే తరువాత జగన్నాథపురం, ఆరుళ్ల, నందమూరు గ్రామాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి వచ్చిన పాస్ పుస్తకాలను పరిశీలించారు. ఆర్‌డీఓ ఖతీబ్ కౌసర్ భానో, మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులు



సమావేశంలో మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి

తణుకు అర్బన్: ఏపీలో మద్యాన్ని వరదలా పారిస్తూ గ్రామాలను ముంచేస్తున్నా కూటమి ప్రభుత్వం కళ్లు మూసుకొని కూర్చుందని ఏపీ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి విమర్శించారు. బుధవారం తణుకు అమరవీరుల భవనంలో నిర్వహించిన ఏపీ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కల్లుగీత సమస్యలపై ఈ నెల 30వ తేదీన ఎక్సైజ్ కార్యాలయాలను ముట్టడి చేసేందుకు జిల్లా కమిటీ తీర్మానించినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా బెల్టు దుకాణాలను తొలగించే వరకు 58 రోజుల పాటు సుదీర్ఘ పోరాటం చేయాలని నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. స్పిరిట్, ప్రమాదకరమైన రసాయనాలు కలిపిన కల్తీ మద్యం గోవా, యానం ప్రాంతాల నుంచి అక్రమ మద్యం ఏరులై పారుతూ వీధి, వీధికి పుట్టగొడుగుల్లా ఉన్న అక్రమ బెల్ట్ షాపుల ద్వారా విక్రయిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలను తాగుబోతులుగా మార్చి వారి ఇళ్లు గుల్ల చేసి మద్యం ద్వారానే ప్రభుత్వం ఆదాయం రాబట్టుకోవాలనే ఉద్దేశ్యంతో ఎక్సైజ్ శాఖకు టార్గెట్లు పెడుతున్నారని దుయ్యబట్టారు. గతంలో ఏ ప్రభుత్వం పెట్టని కష్టాలు, బాధలు కూటమి ప్రభుత్వంలో గీత కార్మికులు అనుభవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కామన మునిస్వామి, జిల్లా కమిటీ సభ్యులు కడలి పాండు, బొంతు శ్రీనివాసు, కట్టా వెంకటేశ్వరావు, పిల్లి ఏడుకొండలు, దొంగ సాయిబాబా, కాసాని శ్రీను, చింతపల్లి చిన్న వీరాస్వామి, జక్కంశెట్టి సత్యనారాయణ, దొంగ సత్యనారాయణ పాల్గొన్నారు.

రూరల్ సీఐ కార్యాలయం తనిఖీ

నరసాపురం: వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం నరసాపురం రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలోని పోలీసు స్టేషన్ల నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు నిర్వహణ, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కొత్త చట్టాలను ప్రతి పోలీస్ స్టేషన్‌లో అమలు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సర్కిల్ పరిధిలో తీసుకున్న చర్యలు, బ్లాక్‌స్పాట్స్ దగ్గర రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నరసాపురం రూరల్ సీఐ జి.దుర్గా ప్రసాద్, నరసాపురం రూరల్, మొగల్తూరు ఎస్సైలు టి.వెంకటసురేష్, జి.వాసు తదితరులు పాల్గొన్నారు.

కుండపోతతో రహదారులు జలమయం



తాడేపల్లిగూడెం రూరల్: కుండపోత వర్షంతో అవస్థలు పడుతున్న ప్రజలు



వర్షంలో తడుస్తూ వెళుతున్న మహిళలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో బుధవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆకాశం మేఘావృతం కావడంతో పాటు ఈదురు గాలులు, ఉరుములతో భారీ వర్షం కురిసింది. దీంతో ఎక్కడ చూసినా వర్షం నీరే కనబడుతుంది. రోడ్లు, డ్రెయిన్లు కాలువల మాదిరిగా నీటి ప్రవాహంతో నిండి పోయాయి. వర్షపునీటితో పాటు బురదనీరు చేరడంతో ఎక్కడ చూసినా చెత్తాచెదారాలు, దుర్వాసన వెదజల్లాయి. పల్లపు ప్రాంతాలు, ఖాళీ స్థలాలు నీట మునిగాయి. పల్లపు ప్రాంతాల్లో ఇళ్లలోకి సైతం నీరు చేరింది.

'గూడెం' జలమయం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. దీంతో పట్టణం జలమయమైంది. సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమైన వర్షం రాత్రి 8 గంటల వరకు ఏకధాటిగా కురుస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో పట్టణంలోని కేఎన్ రోడ్డు, మసీదు సెంటర్, మహాలక్ష్మీ నగర్, సత్యవతినగర్, సుబ్బారావుపేట, వీకర్స్ కాలనీ, కడకట్ల, యాగర్లపల్లి, మార్కెట్, బస్టాండ్, తాలూకాఫీస్ సెంటర్, హౌసింగ్ బోర్డు తదితర లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. డ్రెయినేజీలు పొంగి పొర్లడంతో పాటు రహదారులు జలమయమయ్యాయి. ఇదే సమయంలో కళాశాలలు, పాఠశాలలు విడిచిపెట్టడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పలువురి వాహనాలు వర్షపు నీటికి ఆగిపోయిన పరిస్థితి తలెత్తింది. వర్షంతో లోతట్టు ప్రాంతాల వారికి అవస్థలు తప్పలేదు.

ఉరుములతో భారీ వర్షం

ఇరగవరం: మండలంలోని 21 గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం సాయంత్రం 4 గంటలకు మొదలై రాత్రి ఎనిమిది గంటల వరకు కురుస్తూనే ఉంది. దీంతో రోడ్లు, డ్రెయినేజీలు పూర్తిగా నీట మునిగాయి. వర్షం నీరు ప్రధాన రహదారిపై చేరింది. వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇరగవరం మురుగు లాగే గరిగమ్మల కాలువ, ప్రధాన మురుగు కాలువ రేలంగిలో తలాస కోడు, ప్రభుత్వ ఆసుపత్రి పక్కన ఉన్న కాలువలు పొంగిపొర్లుతున్నాయి. గత వేసవిలో కాలువ ఆధునికీకరణ పనులు సరిగా చేయక పోవడంతో ఇటీవల కాకిలేరు, కొయ్యేటిపాడు వద్ద గండి పడిపోయింది. దానిని తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. మళ్లీ ఎక్కడ గండి పడిపోతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తణుకులో తహసీల్దార్ కార్యాలయంలోకి నీరు



తాడేపల్లిగూడెం (టీఓసీ): కాలువలా మారిన రహదారి



తణుకు తహసీల్దార్ కార్యాలయంలో చేరిన వర్షపు నీరు



జోరువానలోనూ తప్పని బతుకు పోరాటం



మునిగిపోయిన పల్లపు ప్రాంతం

తణుకు అర్బన్: తణుకులో గంటల తరబడి కురిసిన భారీ వర్షానికి రహదారులపై వరద నీరు పొంగి పొర్లింది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు భవనాలు, అపార్టుమెంట్లలో మోకాలు లోతులో నీరు నిలిచింది. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి వరకు కురిసిన భారీ వర్షానికి రహదారులపై వాహనాలు సైతం నీట మునిగాయి.

పాఠశాలల్లో చిక్కుకున్న విద్యార్థులు

పాఠశాలలు విడిచిపెట్టకుండానే వర్షం మొదలు కావడంతో విద్యార్థులు పాఠశాలల్లోనే చిక్కుకుపోయారు. కొన్ని పాఠశాలల్లో చీకటి పడే వరకు ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్సులు, ఆటోల్లో ప్రయాణించే విద్యార్థులు పాఠశాల నుంచి వెళ్లగా, సైకిల్, నడిచి వెళ్లే విద్యార్థులు గంటల తరబడి వేచిచూసి చేసేదిలేక మోకాలిలోతు నీటిలో తడుస్తూ ప్రయాణించాల్సి వచ్చిందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. తణుకు రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు, ఉండ్రాజవరం రోడ్డు, హౌసింగ్ బోర్డు కాలనీ, సజ్జాపురం, ఇరగవరం కాలనీ, ఎన్జీవో కాలనీ, పాతవూరు ఇలా అన్ని ప్రాంతాలు నీట మునిగాయి.

ఆందోళనలో రెవెన్యూ ఉద్యోగులు

తణుకు తహసీల్దారు కార్యాలయంలోకి వర్షపు నీరు చేరడంతో ఉద్యోగులు వర్షపు నీటిలోనే ఉండాల్సి వచ్చింది. అసలే భవనం శిథిలావస్థకు చేరడంతోపాటు పైకప్పు సరిగ్గా లేకపోవడంతో ఉద్యోగులు భయాందోళనతో గడిపారు. రిజిస్టర్‌లు, కంప్యూటర్‌లు, ఇతర సామగ్రి కాపాడుకునేందుకు నానాయాతన పడ్డారు. తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బానో హుటాహుటిన తణుకు తహసిల్దారు కార్యాలయానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

మాదక ద్రవ్యాలు వినియోగించొద్దు



తాడేపల్లిగూడెం (టీఓసీ) మాదక ద్రవ్యాలు వాడొద్దని ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాదక ద్రవ్యాలు వినియోగించొద్దని, ఎక్కడైనా అమ్ముతున్నట్లు, వాడుతున్నట్లు తెలిస్తే నివారణకు తగు చర్యలు తీసుకుంటామని డీఆర్ గోయంక ఉమన్స్ కళాశాలలోని బాలికలచే ప్రతిజ్ఞ చేయించారు. నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వలన కలిగే అనర్థాలను తెలియజేశారు. సీడీపీఓ టీఎల్ సర్వసతి, కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎన్ గణపతిరామ్, సూపర్‌వైజర్స్ సీహెచ్‌కే దుర్గా భవాని, కె.విశాలక్ష్మి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి

తణుకు అర్బన్: మాదక ద్రవ్యాల వినియోగం జీవితంపై తీవ్ర దుష్ప్రభావాన్ని చూపిస్తుందని తణుకు పట్టణ సీఐ ఎన్.కొండయ్య అన్నారు. నాషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా బుధవారం తణుకు జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో నిర్వహించిన యాంటీ డ్రగ్స్ క్యాంపెయన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాదకద్రవ్యాలు సేవించడంవలన మనిషి విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి ఆ మత్తులో ఏం చేస్తున్నారో తెలియక నేరాలకు పాల్పడే పరిస్థితి ఏర్పడుతుందని స్పష్టంచేశారు. పట్టణ ఎస్సై కె.ప్రసాద్, హెచ్ఎం కందుకూరి పద్మావతి, ఏఎస్సై కె.సత్యనారాయణ, కానిస్టేబుల్ ఐ.వెంకటేశ్వరరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు ఆరోగ్యానికి చేటు

తాడేపల్లిగూడెం రూరల్: మాదక ద్రవ్యాలు ఆరోగ్యానికి చేటు కలిగిస్తాయని సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి అన్నారు. నాషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మాధవరం జిల్లా పరిషత్ హైస్కూలు, జూనియర్ కళాశాల విద్యార్థులతో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా ఎల్.అగ్రహారం గ్రామంలోనూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుంచనపల్లిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ రామారావు, పంచాయతీ కార్యదర్శులు బి.ఫణీంద్రకుమార్, ఆర్‌వీ.బ్రహ్మం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, డి.ఎస్తేరు రాణి, బేబి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



తణుకు అర్బన్: సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కొండయ్య



తాడేపల్లిగూడెం రూరల్: మాధవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు